# అన్నపూర్ణ

స్నేహానంద్



**"అమ్మాయి సీతా! పాలన్నీ ఏమయినయ్యే?" కోడలు నడిగింది రమణమ్మ.**

"పిల్లి ముట్టుకున్నట్లుంటే పారబోశా."

"అదేమిటే? రోజూ పాలు పిల్లో, కుక్కో ముట్టుకోడం—అవతల పారబోయటమూనా?" బుగ్గలు నొక్కుకుంది రమణమ్మ.

కోడలు ఏం మాట్లాడుతుంది? తొమ్మిది నెలల పసిగుడ్డు శేరు పాలూ తాగేశాడని అత్తకు చెప్పటానికి సిగ్గుపడింది.

ఒక రోజు రమణమ్మ స్వయంగా మనుమడు పాల పిడత ఖాళీచేయడం చూశాక కోడల్ని సంజాయిషీ అడగటం మానుకుంది. మరో పాడిగేదెను కొని సమస్యను పరిష్కరించుకున్నారు.

కాని భీమసేన్ పెద్దయిన కొద్దీ సమస్యను పరిష్కరించడం కష్టతరమవసాగింది.

ఏదయినా విందు జరిగి నాలుగు పిండి వంటలు తయారవుతున్నప్పుడు పెద్దవాళ్ళెవరూ భీమసేన్‌ను అక్కడ వుండనిచ్చేవారు కాదు. ఏదో పనిమీద అవతలకు పంపేవారు. అలాకాక వంట దగ్గర వుంటే ఏదో ఒక పిండివంట సఫాయిగా వూదేసేవాడు. తీరా వడ్డించవచ్చేసరికి తెల్లముఖం వేయాల్సి వచ్చేది.

ఎవరింటికయినా భోజనానికి వెళ్తే మరీ ఇబ్బందయేది. నేతి జాడీ పూర్తిగా ఖాళీ చేసినా చాలనేవాడు కాదు. పిండివంటలు, పప్పు, ధప్పళం, పెరుగు బకాసురుడిలా ఖాళీచేసేవాడు.

పుట్టిన రోజు పండుగని బుట్టెడు లడ్లు చేయించి నలుగురి పిల్లల్ని, భీమసేన్ క్లాస్‌మేట్స్‌ని పిలిస్తే వాళ్ళు వచ్చేలోపల ఒక్కడే బుట్ట ఖాళీచేసి కూర్చునేవాడు. తల్లీ, నాయనమ్మా, తండ్రీ ఏం చేయాలో తోచక తలలు పట్టుకోవాల్సివచ్చేది.

బడి దూరంగా వుందని మామూలు కారియర్ పంపితే ఆ అన్నం చాలేది కాదతనికి. ప్రత్యేకం ఒక పెద్ద స్టీలు కారియర్ కొని దానినిండా అన్నం, కూరలూ, పెరుగూ కుక్కి పంపితే ఇంటర్వల్‌లో గుటుక్కుమనిపించేవాడు.

"ఒరేయి సుబ్బారావు! వాడికేమయినా




రోగమేమో? లేదా పొట్టలో ఎలుకపాము లున్నాయెమో? తీసికెళ్ళి డాక్టరుగారికి చూపించండిరా!" అంది రమణమ్మ ఓ రోజు.

తండ్రి సుబ్బారావు డాక్టరు దగ్గరకు తీసికొనివెళ్ళి పరిస్థితి అంతా వివరించి చెప్పాడు.

బాగా పరీక్షచేసి "ఏమీ కారణం కనపడటం లేదే? కొన్నాళ్ళయితే యిలా పిచ్చి ఆకలితో పిచ్చితిండి తినటం మానివేస్తాడేమో!" అన్నాడు డాక్టరు.

కాని వయసుతోపాటు తిండి పిచ్చి పెరిగి పోయింది కాని తరుగలేదు.

గుంటూరు కాలేజీలో చేరాక మరో పేచీ వచ్చింది. హోటల్‌వాళ్ళెవరూ భీమసేన్ తిండిచూసి అతనికి భోజనం పెట్టడానికి ఒప్పుకునేవారు కాదు! అతను రాగానే "మెల్సు సెక్షన్ మూసేశాం సార్" అనేవారు!

హాస్టల్‌లో చేరక తప్పలేదు. మెస్సు మూసివేయబోయే ముందు వెళ్ళేవాడు భీమసేన్. అడుగూ బొడుగూ మిగిలిందంతా తెచ్చి వేసేవాడు వంటవాడు. అప్పుడుగాని ఆత్మారాముడు చల్లారేవాడు కాడు. కాలేజీ చదువు అయ్యేవరకు అలా గడిచిపోయింది!

బి.యే. అవగానే పెండ్లిచేశారు. ఉద్యోగరీత్యా విజయవాడలో కాపురం పెట్టాడు భీమసేన్!

పదోరోజే పుట్టింటికి పరిగెట్టుకొని వెళ్ళిపోయిందతని భార్య. "నాకు తాళి కట్టేడు కాని అన్నం తెప్పాలాకుకడితే బాగుండేది" అని చెప్పిందామె!

తల్లీ, నాయనమ్మా తల్లడిల్లిపోయారు, భార్య విడాకుల దావా వేసిందనగానే!

'పిచ్చి భీమయ్య! తిండి సరిలేక ఎలా చిక్కిపోయాడో' అనుకుంటూ విజయవాడ వచ్చింది రమణమ్మ!

భీమసేన్ ఇల్లు తాళంవేసి వుంది! వాకబు చేస్తే వీధిచివర హోటల్‌లోనే వుంటున్నాడన్నారు ఇరుగు పొరుగూ! పొద్దుపోయాక ఇంటికొచ్చాడు భీమసేన్! అన్నపూర్ణ హోటల్ ప్రొప్రయిటర్‌కు ఒక్కతే కూతురు! ఆమె పేరే హోటల్‌కు పెట్టాడు! పాతికేళ్ళు వచ్చినా పెండ్లి కాలేదామెకు. ఆమె వంక కన్నెత్తి చూడటానికి భయపడేవారు పెండ్లి చూపులకొచ్చిన వాళ్ళు!

హోటల్ కట్టేసే సమయానికివెళ్ళి మిగిలిన పదార్థాలన్నీ ఆవురుమని తినేవాడు భీమసేన్. భార్యనుంచి విడాకులు రాగానే అన్నపూర్ణను వివాహం చేసుకున్నాడట!

అన్నపూర్ణ హోటల్‌లో అన్నంమెతుకు వృధాపోవడంలేదిపుడు!

రమణమ్మ, సీతమ్మ నిశ్చింతగా నిద్రపోతున్నారిపుడు! ●